
# వ్యవస్థకు పునాది



అన్నపూర్ణ

మా వూరు వెళ్ళాలంటే నాకు మహా సరదా. కారణం పుట్టి పెరిగినగడ్డ. అక్కడ నేను తిరగని ప్రదేశం, తెలియని మనుషులు లేరు. వెళ్ళినప్పుడల్లా అమ్మ చేసి పెట్టే పిండివంటలు, మిత్రుడు రాజా యిచ్చే స్నేహ ఆతిథ్యం నన్ను ముగ్ధుణ్ణి చేస్తాయి.

రాజా నాకు మంచి మిత్రుడు. చాలా కాలం ఒకే దగ్గిర చదువుకున్నాం. ఆతడు ఆదర్శ భావాలున్న యువకుడేకాదు. అభ్యుదయ రచయిత కూడా! ఆస్తి పాస్తులు పుష్కలంగ వున్న కారణాన- రాని ఉద్యోగం గురించి బెంగ పెట్టుకోకుండా హాయిగా కాలం గడుపుతున్నాడువాడు ఆ పల్లె పట్టున.

వరినాట్లు వడేటప్పుడు ఒకసారి, కోత అప్పుడు ఒకసారి, కుప్ప నూర్పిళ్ళప్పుడు ఒకసారి— అమ్మ ఉత్తరాలు. రాస్తూంటుంది. నేను వచ్చి నాలుగు రోజులు వుండి పోతూంటాము. పగలల్లా పొలంలో వుండి, చీకటిపడే సమయానికి ఇంటికి వస్తాను. తర్వాత రాజా దగ్గిరికి నేను వెళ్ళటమో, నా దగ్గిరికి వాడు రావటమో జరుగుతుంది ప్రతి రోజూను. ఇద్దరం 'తీరు బాటుగా కూర్చున్నాక, ఏదో విషయం మీద చర్చ మొదలవుతుంది. విషయం లౌకికం కావచ్చు, రాజకీయం కావచ్చు, లేదా సాహిత్యం కావచ్చు. అలా తెలియకుండానే గడిచిపోతాయ్ రోజులు అక్కడ.

అలాగే ఈసారి అమ్మ 'వరి కోతలు మొదలవుతున్నయ్ ఒసారి నువ్వు వచ్చి వెళ్తే బావుంటుంది. వచ్చేటప్పుడు కోడలిని, మనవణ్ణి కూడా తీసుకురా' అని హుకుం జారీ చేసింది. మరి ఆమె మాట పాటించక తప్పుతుందా? నిజానికి నాన్న పోయాక కూడా ఆ కుగ్రామవాసాన్నే పట్టుకు వ్రేలాడే అమ్మను తలుచుకున్నప్పుడల్లా నా మనసు ఏదోలా అవుతుంది. కానీ, అక్కడ ఉండడమే ఆమెకు ఆనందం.

* * *

ఆవేళ సాయంత్రం నేను పొలం నుంచి వచ్చాను. అదే సమయంలో రాజా కూడా ప్రత్యక్షమయ్యాడు మా యింటి దగ్గిర. ఇద్దరికి కాఫీ యిచ్చింది అమ్మ. తీరుబాటుగా వరండాలో కూర్చొని బాతఖానీ కొట్టడం మొదలు పెట్టాం.

అలా చాలా సేపు గడిచింది బాగా చీకటి పడిందని, అమ్మవచ్చి వరండాలో లైటు వేసింది. "లోపల ఒకటే అల్లరి చేస్తున్నాడు. వీణ్ణి మీ దగ్గిర కూర్చోబెట్టుకోండి" అంటూ చంటాణ్ణి తెచ్చి నావళ్ళో కూలేసి పోయింది నా సతీమణి.

ఇంతలో బయట "అమ్మా, ఓ ముద్ద అన్నం పెట్టు తల్లీ.. పిల్లోడు ఒకటే ఏడుస్తున్నాడు" అంటూ ఓ అడుక్కుతినే అమ్మాయ్ వచ్చింది.

"ఆగమ్మాయ్, తెచ్చి వడేస్తారులేగాని అరవకు" అని కసురుకున్నాడు రాజా.

"అమ్మా, ఓసారిలా బయటికి రా" అని అమ్మని పిలిచి- ఆ అమ్మికో ముద్ద పడెయ్యమన్నాను.

"దీనికా! ఏమ్మాయ్, రోజూ నీకిదొక వుద్యోగమా?" అంది అమ్మ ఆ అమ్మిని చూసి, పూర్వ పరిచయమున్నట్లే.

అయినా చలించకుండా అలాగే నిలబడి వుంది ఆ అమ్మి. చంకలో పిల్లవాడు. మాసిపోయిన ముతక చీర. పయిట దగ్గిర ఒకటి రెండు మాసికలు, తలంతా దుబ్బులా వుంది. అలాంటి వాళ్ళను చూస్తే— నా మనసుకు బాధ అనిపిస్తుంది.

"పోనీలేగాని— ఓ ముద్ద పెట్టి పంపించమ్మా" అన్నాను.

"వడేస్తానురా— వడెయ్యటానికి వీళ్ళేమైనా కాటికిగతిలేని అనాథలా? పగలల్లా ఇంటిల్లిపాదీ కూలి పనులకు వెళ్ళి సంపాదిస్తారు. సాయంత్ర సమయానికి అందరూ తలో బజారూ బయలుదేరుతారు అడుక్కోవటానికి. దేవుడు పెట్టింది కొంతైతే, వీళ్ళు చేసుకునేది కొంత" అంది అమ్మ.

నాకు అర్థమైందప్పుడు... కోస్తా ప్రాంతంలో వరినాట్లప్పుడు, కోతలప్పుడు ఇతర జిల్లాల నుంచి కూలీలు వస్తారు. ఈ అమ్మి ఆ బాపతే నన్నమాట.